
ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

సంకల్పం.. నెరవేరింది..!

- ఒకే రోజు 1,11,111 మందికి హక్కు పత్రాలు పంపిణీ చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక
- తండాలన్నింటినీ రెవెన్యూ గ్రామాలుగా మారుస్తాం
- 'సమర్పణ సంకల్ప' సదస్సులో రాహుల్ గాంధీ
- ఘనంగా కాంగ్రెస్ రెండేళ్ల విజయోత్సవ సభ


ప్రసంగిస్తున్న సీఎం సిద్ద రామయ్య

బళ్ళారి, మే 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో అందరికీ భూహక్కులు కల్పించాలన్న సంకల్పం నేటితో నెరవేరిందని, 'భూమి హామీ' ఇచ్చామని, అదే అమలు చేస్తున్నామని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. విజయనగరం జిల్లా హొస్పేట్‌లోని పునీత్‌రాజ్‌కుమార్ జిల్లా స్టేడియంలో మంగళవారం జరిగిన 'సమర్పణ సంకల్ప' సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ 2016లో రాష్ట్రలో భూమి పట్టాలు లేని కుటుంబాలు లక్షలాదిమంది ఉన్నారని తెలుసుకున్నానని, దాన్ని అమలు చేయాలని సూచించానని, అని ప్రస్తుతం సాకారమైందన్నారు. ఆదివాసులు తండాల్లో నివసించే వారన్నారు. టైటిల్‌డీడ్‌ను కాగితం రూపంలో కాకుండా డిజిటల్ రూపంలో అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2వేల రెవెన్యూ గ్రామాలను గుర్తించామని, మరో 500 రెవెన్యూ గ్రామాలను ఇంకా గుర్తించాల్సి ఉందని, అది కూడా ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. 'ప్రజలకు భూమిపై యాజమాన్య హక్కు ఉండాలనేది ఇందిరాగాంధీ కల' అని అందరికీ భూమిని అందించే మొదటిరాష్ట్రం కర్ణాటక అవుతుందన్నారు. కాగా రాష్ట్రంలో ఐదు గ్యారెంటీల అమలును ఆయన వివరించారు. అనంతరం 1.11 లక్షల కుటుంబాలకు భూమి పట్టాలను అందజేశారు.


సదస్సుకు హాజరైన కార్యకర్తలు


తండా మహిళకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ప్రతి హామీ నెరవేరుస్తాం: సీఎం

ఎన్నికల సమయంలో ఇచ్చిన 142 హామీలను రెండేళ్లలో నెరవేర్చామని, ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా గ్యారెంటీలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మంగళవారం హొస్పేట్‌లో జరిగిన కాంగ్రెస్ విజయోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రెవన్యూ శాఖ నిర్వహించిన 'సమర్పణే సంకల్ప' సమావేశంలో 1,11,111 మందికి ఇంటి హక్కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. అనంతరం ఉక్కు మహిళా ఇందిరాగాంధీ విగ్రహాన్ని అవిష్కరించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన 30కొత్త కార్యక్రమాలను రూపొందించి అమలు చేశానని సీఎం అన్నారు. ప్రజలకు అబద్ధాలు చెప్పడమే బీజేపీ పనిగా పెట్టుకుందన్నారు. మనదేశం అన్ని దేశాలకు శాంతి ఉద్యానవనం, అందరినీ సమానంగా గౌరవించే రాష్ట్రం. రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలను సమానంగా చూడాలన్నారు. బీజేపీ ఎప్పుడూ సొంతంగా అధికారంలోకి రాలేదు. ఇప్పుడు జేడీఎస్ , బీజేపీ కలిసి వచ్చాయని, ఆపరేషన్ కమలం ద్వారా అధికారంలోకి రావడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో బీజేపిని ప్రజలు ఎన్నుకోలేదన్నారు. గృహలక్ష్మి పథకం కింద 1.22కోట్లు కుటుంబాల పెద్దలకు రూ. 2000 ఇస్తున్నామన్నారు. గృహజ్యోతి కింద 1.30కోట్ల కుటుంబాలకు ప్రయోజనాలను అందించామన్నారు. శక్తి యోజన కింద రాష్ట్రవ్యాంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో కోట్లాది మందికి ఉపయోగకరమన్నారు.

అంతర్గత రిజర్వేషన్లలో తీవ్ర అన్యాయం: ఖర్గే



అంతర్గత రిజర్వేషన్లు కల్పించేందుకు జరుగుతున్న కుల సర్వేలో లింగాయత, బేడి, జంగమ వర్గాలను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చడంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం విజయనగరం జిల్లా హొస్పేట్‌లో జరిగిన 'సమర్పణ సంకల్ప' సదస్సులో ఆయన మాట్లాడుతూ కుల వర్గీకరణ కల్పించడానికి ప్రభుత్వం ఎస్సీ కమ్యూనిటీపై సర్వే నిర్వహిస్తోందన్నారు. అంతర్గత రిజర్వేషన్లను తాను వ్యతిరేకించలేదన్నారు. అయితే లింగాయత కమ్యూనిటీకి చెందిన బేడ, జంగమలను ఎస్సీ జాబితాలో చేరుస్తున్నారన్నారు. లింగాయతలను పేదలుగా ప్రోత్సాహిస్తామని అయితే బేడ జంగమను ఎస్సీ జాబితాలో చేర్చడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో బుడగ జంగము సమాజానికి చెందినవారు 500మంది ఉన్నారని, అయితే అదే పేరుతో 4లక్షలమంది ఎస్సీ జాబితాలో ఎలా వచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బేడ జంగమను ఎస్సీ జాబితాలో చేరిస్తే, అది అంటరానివారికి వ్యతిరేకంగా చేసిన చర్య అన్నారు. దళిత వ్యతిరేక చర్యగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ వర్గాల హక్కులను హరించడానికి మీరు దీన్ని ఎలా చేస్తున్నారన్నారు? మీరు పరిస్థితులు చక్కపెట్టడానికి చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ఖర్గే ఉద్వేగాన్ని గమనించిన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు.

నకిలీ ధ్రువపత్రాలపై చర్యలు తీసుకోవాలి

కాగా షెడ్యూల్డ్ కులంలో చేరడానికి నకిలీ కులధ్రువీకరణపత్రాలు ఇచ్చే వారిని జైలులో పెట్టాలన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలన్నారు. ఇలాంటి సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం చూపడానికి అందరమూ కలసి రావాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల వారికి కులగణన నిర్వహించాలనేది రాహుల్‌గాంధీ ఆశయంగా ఉండేదని, తొలుత దీనిని విమర్శించారన్నారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా కేబినెట్ సమావేశం నిర్వహించి జనాభా లెక్కల వేళ కులగణనను నిర్వహిస్తామని, వెనుకబడిన వర్గాలకు ఓ కాలమ్‌ను చేరుస్తామని ప్రకటించారన్నారు. ప్రస్తుతం కులవర్గీకరణ కోసం చేపట్టిన సర్వే సజావుగా సాగాలని ఆకాంక్షించారు. రాహుల్‌గాంధీకి చెడ్డపేరు రాకూడదన్నారు. మీరు వ్యక్తిగత క్రెడిట్ పొందాలని భావిస్తే అది మొత్తం రాష్ట్రానికి ఇబ్బంది కలిగిస్తుందన్నారు.

కాంగ్రెస్ ఎవ్వరికీ తలవంచదు..

కాగా కాంగ్రెస్ ఎప్పటికీ తలవంచదన్నారు. మీరు కాంగ్రెస్‌పై కేసు వేస్తున్నారని, ఈడీని ప్రయోగిస్తున్నారని, మా వార్తాపత్రిక నేషనల్ హెరాల్డ్‌పత్రికపై దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ, ఐటీ వంటిని ప్రయోగించి ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నల్లధనాన్ని తెచ్చి ఒక్కొక్కరికి రూ.15లక్షలు ఇస్తామన్న హామీ, 2కోట్ల ఉద్యోగాలు అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండు నెలల్లో చక్కెర కర్మాగారం పునఃప్రారంభం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్



వక్ఫ్ మైనార్టీ సంక్షేమ శాఖ, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జమీర్ ఖాన్ మంగళవారం విజయనగరం జిల్లాహొస్పేట్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒకటైన మూతపడిన చక్కెర పరిశ్రమను రెండునెలల్లోపు ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ విజయోత్సవ సభకు 1.6లక్షల మంది హాజరవుతారని అంచనా వేశామని, కానీ 3లక్షల మంది పైగా హాజరు కావడం తమ ప్రభుత్వం సాధించిన ఘనత అన్నారు. హాజరయిన ప్రతి ఒక్కరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని రూ.100కోట్లతో తీర్చిదిద్దాలని, మెరుగైన వైద్యసేవలు అందించడానికి హైటెక్ ఆసుపత్రిని ప్రారంభించాలన్నారు. తుంగభద్ర డ్యామ్ గేట్లు మరమ్మతు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈప్రాంత రైతుల చిరకాల కోరిక చక్కెర కర్మాగారాన్ని ప్రారంభిస్తామన్నారు. చక్కెర కర్మాగారానికి అనువైన స్థలాన్ని గుర్తించి రాబోయే రెండునెలల్లో భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య హామీ ఇచ్చారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో నిలిచిపోయిన వర్షపు నీరు

వదలని వరుణుడు

- రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజూ జోరువానలు
- తడిసిముద్దయిన బెంగళూరు
- కొనసాగిన సహాయక చర్యలు
- మరో ఐదు రోజులు వర్షాలు
- వాతావరణ శాఖ ప్రకటన


ప్లకార్డులు చూపుతున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షబీభత్సం కొనసాగుతోంది. రెండో రోజూ వర్షాలతో నగరం తడిసి ముద్దయ్యింది. మరో ఐదు రోజులు వర్షాలు దంచి కొడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. నగరంలో రెండో రోజూ జోరువాన కురిసింది. బెంగళూరులో వర్షంతోపాటు సహాయకచర్యలు జోరందుకున్నాయి. సోమవారం రాత్రి ప్రారంభమైన వర్షం మంగళవారం ఉదయం 9 గంటలదాకా నగర వ్యాప్తంగా హోరెత్తించింది. గ్రేటర్ బెంగళూరు, సివిల్ డిఫెన్స్, అగ్నిమాపకశాఖ అధికారులు రాత్రంతా సహాయక చర్యలు కొనసాగించారు. రాష్ట్రమంతటా మరో ఐదు రోజులు వర్షం కొనసాగుతుందని వాతావరణ పరిశోధనశాఖ మంగళవారం సాయంత్రం ప్రకటించింది. 7 జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించగా అందులో ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి, కొడగు, శివమొగ్గ, చిక్కమగళూరు, హాసన్ ఉన్నాయి. రాత్రి వేళల్లో 7 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. ఇక బెంగళూరులో వర్షం కొనసాగనుందని మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వ్యవధిలో వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది. బెంగళూరు నగరవ్యాప్తంగా ఆరంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. మరోవైపు వర్షపునీటితో జలమయమైన సాయి లే అవుట్, కోరమంగల, అట్టూరు లే అవుట్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఓవైపు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మహదేవపురలో బెళ్ళందూరు చెరువులోకి వర్షపునీటిని మళ్ళించే చర్యలు చేపట్టారు. మంత్రి రామలింగారెడ్డి పనులను పరిశీలించారు. బీజేపీకి చెందిన విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామి సహా పలువురు వర్షపీడిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధిత ప్రజలతో మాట్లాడారు. మరోవైపు మధ్యాహ్నం వర్షం కురవడంతో మరిన్ని ప్రాంతాల్లో సమస్య ఏర్పడింది. చామరాజపేటలో ఓ చెట్టు నేలకూలగా మహదేవపుర ప్రాంతంలో పొక్లైనర్ ద్వారా ఆహార పదార్థాలను, నీట మునిగిన ప్రాంతాల్లో పంపిణీ చేశారు. అత్యవసరంగా పలు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటుచేశారు. మోటార్లను అమర్చి సెల్లార్, ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించే ప్రక్రియ కొనసాగింది. ప్రతిపక్ష నేత అశోక్ మాట్లాడుతూ బెంగళూరులో 1600 కోట్ల రూపాయల పనులు జరిగి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. గ్రేటర్ బెంగళూరు కాదని, లూటర్ బెంగళూరు అంటూ మండిపడ్డారు. జనం కష్టాలు పడుతుంటే కాంగ్రెస్ సంబరాల్లో మునిగి తేలుతోందన్నారు.


చామరాజపేటలో కూలిన భారీ వృక్షం

ఐపీఎల్ మ్యాచ్ లఖ్‌నవ్‌కు మార్పు

మరో రోజులపాటు బెంగళూరులో వర్షం కొనసాగనుందని వాతావరణ పరిశోధన శాఖ మంగళవారం సాయంత్రం ప్రకటించిన మేరకు ఈనెల 23న బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మ్యాచ్‌ను లఖ్‌నవ్‌కు మార్పు చేశారు. ఈ విషయాన్ని ఆర్‌సీబీ అధికారిక ఎక్స్‌లో ప్రకటించింది.

సహాయక చర్యలను పరిశీలిస్తున్న మంత్రి రామలింగారెడ్డి



విదేశాల్లో ఉద్యోగాల పేరుతో 300 మందికి మోసం

- నకిలీ నియామక పత్రాలతో గోల్‌మాల్
- రూ.9కోట్లకు పైగా వసూలు
- మంగళూరులో వెలుగులోకి..

బెంగళూరు, మే 20(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరులోని ఓ ఏజెన్సీ 300మందిని మోసం చేసింది. వారినుంచి రూ.9కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బెందూరు వెల్ ప్రాంతంలో హైర్ గ్లో ఎలిగెంట్ ఓవర్సీస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేశారు. న్యూజిల్యాండ్‌లోని వరదీస్ రిగ్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని 185మందినుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.1.65 లక్షల నుంచి 1.80 లక్షల దాకా నగదు తీసుకున్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందినవారు ఎక్కువమంది బాధితులున్నారు. సుమారు 60మందితో ఇతర కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామని రూ.3-5లక్షలు దాకా వసూలు చేశారు. ఉద్యోగాలకోసం వచ్చినవారి నుంచి ఆన్‌లైన్ ద్వారా 14 బ్యాంకు ఖాతాలకు జమ చేయించుకున్నారు. అయితే నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాలేదు. నవంబరులో ఏజెన్సీకి చెందిన గ్రేటర్ క్వాడ్రస్, అశ్విని ఆచార్య, చైత్ర అనేవారు ఇంటర్వ్యూలకు రావాలని నమ్మించారు. నవంబరు ఆఖరులో మెడికల్ ఫిట్‌నెస్‌కు పంపారు. జనవరి మొదటివారంలో ఉద్యోగంలో చేరాలని, కాంట్రాక్టు సంతకం చేయాలని సూచించారు. అదే నెలలో వీసా ప్రక్రియ ప్రారంభించామన్నారు. వీసాలు వచ్చిన వెంటనే ఉద్యోగాల్లో చేరాలని నమ్మించారు. ఏప్రిల్ చివరివారంలో ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నవారికి కొరియర్ వచ్చింది. అందులో ఏజెన్సీకి సమర్పించిన పాస్‌పోర్ట్ తదితర రికార్డులను వాపసు పంపారు. ఈమేరకు బాధితులు కద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత మంగళూరు నగర పోలీస్ కమిషనర్, జిల్లా అధికారిని కలసి సమగ్ర వివరాలు వివరించారు. ఈమేరకు ముంబైకు చెందిన మసీవుల్లా అథావుల్లాఖాన్‌తోపాటు గ్రేటర్ క్వాడ్రస్ అశ్విని ఆచార్య, చైత్రలపై ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏజెన్సీ నిర్వాహకుడు మసీవుల్లా అథావుల్లాఖాన్‌ను అరెస్టు చేసినట్లు మంగళూరు నగర పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ప్రకటించారు. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించకపోవడంతో ఇద్దరు పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రకటించారు.


నిందితుడు మసీవుల్లా అథావుల్లాఖాన్

సంతానం కలగలేదని భార్యను కడతేర్చాడు..

- సహకరించిన అత్తామామలు
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- విచారణలో బట్టబయలు

బెంగళూరు, మే 20(ఆంధ్రజ్యోతి): సంతానం కలగలేదని పథకం ప్రకారం భార్యను హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడా ప్రబుద్ధుడు. అయితే పోలీసుల విచారణలో నిజాలు బయట పడడంతో కటకటాలపాలయ్యాడు. ఈ దారుణసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెళగావి జిల్లా అథణి తాలూకా మలబాద్ గ్రామానికి చెందిన రేణుకాసంతోష్ హొనకాండె (27) మృతిచెందిన మహిళ. గ్రామానికి చెందిన సంతోష్ హొనకాండెతో రేణుకాకు వివాహం జరిగింది. వీరితో పాటు మామ కామణ్ణ, అత్త జయశ్రీ నివసిస్తున్నారు. కొన్నేళ్లు గడిచినా పిల్లలు కలగలేదని ఇటీవల భర్త, అత్త, మామలు రేణుకాను వేధించడం మొదలుపెట్టారు. శనివారం రాత్రి 8 గంటలకు మలబాద్ గ్రామం నుంచి రేణుకాను భర్త సంతోష్ బైక్‌పై తీసుకెళ్లాడు. గ్రామ శివారుకు చేరుకున్న తర్వాత వాహనాన్ని కదిలించడంతో ఆమె కింద పడింది. అప్పటికే అక్కడికి చేరుకున్న అత్తమామలు ఆమెను రాళ్లతో తలపై బాది హతమార్చారు. ఆ తర్వాత ఆమెను ద్విచక్రవాహనానికి కట్టి సుమారు 120 అడుగుల మేర లాక్కెళ్లారు. ద్విచక్రవాహన చక్రానికి చీరకొంగు చిక్కుకోవడంతో ప్రమాదం జరిగిందని, రోడ్డుపై పడి మృతి చెందినట్లు నమ్మించారు. ఇదే విషయాన్ని గ్రామస్తులు, బంధుమిత్రులకు తెలిపారు. పోలీసులు అనుమానంతో సోమవారం భర్త, అత్తమామలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించడంతో చెరో సమాధానం చెప్పారు. దీంతో పోలీసులు మందలించడంతో హతమార్చినట్లు నిజం అంగీకరించారు. భర్త, అత్తమామలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.



రెండేళ్లయినా పూర్తి కాని ప్లై ఓవర్ పనులు \ 12 కి.మీ. మేర ట్రాఫిక్ జామ్ \ కార్మిక విధానాలపై ట్రేడ్ యూనియన్ల నిరసన 8లో



వానలు ఫుల్..!

ఈ ఏడాది అధిక వర్షాలు

30నే నైరుతి రుతుపవనాల రాక

వాతావరణ శాఖ

బుక్కరాయసముద్రం, మే 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానలే వానలు. దంచికొడతాయని వాతావరణ శాఖ సూచిస్తోంది. ఉమ్మడి జిల్లాను నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా తాకనున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ తీరాన్ని తాకినట్లు ప్రకటించింది. అక్కడి నుంచి కేరళకు ఈనెల 26, 27 తేదీల్లో నైరుతి రుతుపవనాలు చేరే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ముందుస్తుగానే ఉమ్మడి జిల్లాకు మే చివరి వారంలోనే నైరుతి రుతుపవనాలు తాకనున్నట్లు రేకలకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఈ ఏడాది అత్యధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించింది. ఇప్పటికే ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారంలో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు ముందుస్తుగానే జిల్లాలోకి ప్రవేశించనుండడంతో రైతుల్లో ఖరీఫ్ సాగుపై ఆసక్తి పెరుగుతోంది. సాధారణం కంటే ఈ ఏడాది అధికంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడు నారాయణస్వామి తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు లోతు దుక్కులు, పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపినట్లు శాస్త్రవేత్త నారాయణ స్వామి చెప్పారు. ఇది ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలకు పండగ లాంటి సమాచారం.

రానున్న మూడు రోజులు వర్షాలు

ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుతం ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురుస్తాయన్నారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే అవకాశం ఉందన్నారు. 12-13 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులు చేసుకోండి

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా పలు చోట్ల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భూమిలో ఉన్న తేమను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలని శాస్త్రవేత్త నారాయణ స్వామి తెలిపారు. దుక్కులు చేసుకోవడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. రాబోవు సీజన్‌లో కలుపు, తెగులు, వ్యాధుల ఉధృతి తగ్గే అవకాశం ఉందన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసుకునే పంటకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరిసాగు చేసే, కోత కోసిన రైతులు ప్రస్తుతం ఉన్న తేమను వినియోగించుకుని, పచ్చిరొట్టె ఎరువులను వేసుకోవాలి. పచ్చిరొట్టె పైర్లను సాగు చేయడానికి వర్షాకాలం ఎంతో అనువైనదన్నారు. రైతులు తొలకరి వర్షాలను వినియోగించుకుని పచ్చిరొట్టె పైర్లు వేసుకోవాలన్నారు. తేమను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

లక్ష్మీనారసింహుడికి ఘనంగా పూజలు

ఆమిద్యాలకు పయనమైన ఉత్సవ విగ్రహాలు



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఉరవకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 9న ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. 12రోజులపాటు ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆమిద్యాలకు తీసుకెళ్లారు. ఆమిద్యాలలోని పెన్నోబులేశుడి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఉంచారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది దీపక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీలోకి వేసిన సొమ్ము, కానుకలను మంగళవారం లెక్కించారు. బ్రహోత్సవాల పర్యవేక్షణ అధికారి పాండురంగారెడ్డి, దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి పర్యవేక్షణలో హుండీలను తెరచి, లెక్కించారు. మొత్తం రూ.15.85 లక్షల హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో రమేష్‌బాబు తెలిపారు. అన్నదాన హుండీ ద్వారా 8,212 వచ్చిందన్నారు.

ఎన్నాళ్లీ నిర్లక్ష్యం

సొంత భవనంలేని జలవనరుల శాఖ

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు బుట్టదాఖలు

హెచ్చెల్సీ స్థలాన్ని వైసీపీకి అప్పగించిన అధికారులు

అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ పలు పోస్టులు ఖాళీ

ఈ ప్రభుత్వంలోనైనా జలవనరుల శాఖపై నిర్లక్ష్యం వీడేనా..?





ఇరుకు గదిలోనే హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం, హెచ్చెల్సీ స్థలంలో నిర్మాణం పూర్తయిన వైసీపీ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు సొంత కార్యాలయ భవన నిర్మాణం కలగానే మిగిలింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ప్రధానంగా హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్ట్‌లను గాలికొదిలేశారు. పైగా వైసీపీ కార్యాలయ నిర్మాణం కోసం హెచ్చెల్సీకి సంబంధించిన రెండు ఎకరాలు ఆక్రమించారు. నగరంలోని తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యా లయాన్ని 2021లో ఉన్నఫలంగా ఖాళీ చేయించారు. గత మూడెన్నరేళ్లుగా మూడు గదుల్లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో జలవనరుల శాఖ కార్యాలయ నిర్మాణం కోసం మూడుసార్లు జిల్లా ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. గత ఏడాది నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో కార్యాలయ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. గత నెలలో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. హెచ్చెల్సీలోని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ), ధర్మవరం బ్రాంచ్ కెనాల్ (డీబీసీ) రెండు డివిజన్లకు ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు. హెచ్చెల్సీలో కీలకంగా ఉండే లోకలైజేషన్ ఈఈ ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అది కూడా ఖాళీ అవుతుంది. హంద్రీనీవాలో ఎస్ఈతోపాటు డివిజన్ 5, డివిజన్ 7, పెనుకొండ డివిజన్లకు ఇన్‌చార్జి ఇంజనీర్లే కొనసాగుతున్నారు. వెంటనే రెగ్యులర్ ఇంజనీర్లను నియమించి ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కీలక పోస్టులు ఖాళీ

జలవనరుల శాఖలో కీలక పోసులు ఖాళీగా ఉన్నాయి. గతనెల 30న హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. హెచ్చెల్సీలో సుమారు రూ.50కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో కీలకంగా ఉండే ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండటం విమర్శలకు దారితీస్తోంది. హెచ్చెల్సీ పరిధిలోని ధర్మవరం కెనాల్ డివిజన్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ డివిజన్‌లు రెండింటికీ ఇన్‌చార్జి ఈఈలే కొనసాగుతున్నారు. హెచ్చెల్సీలో కీలకంగా ఉండే లోకలైజేషన్ డివిజన్ ఈఈ వెంకటరమణారెడ్డి కూడా ఈనెలాఖరులో ఉద్యోగవిరమణ చేయనున్నారు. హంద్రీనీవాలో ఎస్ఈ పోస్టు, డివిజన్ 5, 7, పెనుకొండ డివిజన్‌లలోనూ ఇన్‌చార్జి ఈఈలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం హంద్రీనీవాలో సుమారు రూ.1400కోట్లతో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు, లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కీలక పోస్టులలో ఇన్‌చార్జిలు కొనసాగుతుండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

మూడు ముక్కలుగా హెచ్చెల్సీ కార్యాలయం

హెచ్చెల్సీ కార్యాలయాన్ని మూడు ముక్కలు చేశారు. సుమారు 20ఎకరాలకు పైగా సొంత స్థలం ఉన్నా సొంత భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ శాఖ ఉంది. కొన్నేళ్ల కిందట నగరంలోని తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని బలవంతంగా ఖాళీ చేయించారు. 2021లో ఉన్న ఫలంగా అక్కడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి విస్తరణ నిర్మాణాలు చేపట్టాలని అప్పటి అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఒత్తిడితో ఖాళీ చేశారు. సొంత స్థలం ఉన్న హెచ్చెల్సీ కాలనీలో ఏదో ఒక చోట కార్యాలయం నిర్మించుకోవచ్చు అనుకున్నారు. అయితే హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ ఒక చోట, మిగిలిన సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. దీంతో హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం మూడు ముక్కలు అయ్యింది. అయితే ఇంతవరకు సొంత భవనానికి సంబంధించి నిధులు, నిబంధనలు జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆశాఖ ఉద్యోగులు వాపోతున్నారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయం నిర్మించాలని రెండెకరాల స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించారు. మట్టి తవ్వి వదిలేశారు.



హంద్రీనీవా కార్యాలయం

హెచ్చెల్సీ స్థలంలో వైసీపీ కార్యాలయం

అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ విలువైన హెచ్చెల్సీ స్థలంలో రెండెకరాల స్థలాన్ని తమ పార్టీ కార్యాలయం కోసం తీసుకుంది. జలవనరుల శాఖ ఇంజనీర్లు నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఓ పార్టీకి అప్పగించడం సాధ్యం కాదని చెప్పినా, రాష్ట్రస్థాయిలో అప్పటి వైసీపీ వీరభక్తుడిగా ఉన్న జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి ఒత్తిడితో సుమారు 2 ఎకరాల స్థలాన్ని అప్పగించారు. ఏడాదికి రూ.1000 నామమాత్రపు అద్దెతో లీజుకు తీసుకున్నారు. 33ఏళ్ల పాటు ఈ స్థలం వైసీపీ అద్దెకు తీసుకుంది. వైసీపీ కార్యాలయ భవనం నిర్మాణం వేగంగా పూర్తి చేశారు. అదే సమయంలో జలవనరుల శాఖ కార్యాలయం మాత్రం ప్రహరీకే పరిమితమైంది.

ప్రతిపాదనలు పంపాం



జలవనరుల శాఖ కార్యాలయం కోసం మూడేళ్ల కిందట మూడు సార్లు ప్రతిపాదనలు పంపాం. హెచ్చెల్సీ స్థలంలో ఒకటిన్నరెకరా స్థలంలో జలవనరుల శాఖ కార్యాలయం నిర్మాణం చేపట్టేందుకు రూ.14కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. మూడుసార్లు గత ప్రభుత్వంలో సిద్ధం చేసిన ప్రతిపాదనలు జలవనరుల శాఖకు పంపించాం. ఒక్కసారి కూడా అక్కడ నుంచి ప్రతిస్పందన రాలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. ఇక హెచ్చెల్సీ ఎస్ఈ స్థానంలో కొత్త అధికారిని త్వరలోనే నియమిస్తారు. ఇన్‌చార్జిలుగా పలు చోట్ల ఇంజనీర్లు కొనసాగుతున్నారు. అయితే ఎక్కడా పనులు ఆగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

-నాగరాజ,
జలవనరుల శాఖ సీఈ

గుడ్లు తేలేయాల్సిందే..!

చిన్నారుల పౌష్టికాహారంలో కక్కుర్తి

తవ్వేకొద్దీ బయటికొస్తున్న అక్రమాలు

తూతూమంత్రంగా అప్పటి ఆర్డీఓ నివేదిక

లక్షల్లో కోడిగుడ్లు స్వాహా

వైసీపీ హయాంలో యథేచ్ఛగా దోపిడీ పర్వం



కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేసే కోడిగుడ్లనూ కక్కుర్తికి పాల్పడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై కోడిగుడ్లను పక్కదారి పట్టించి స్వాహా చేశారు. అక్రమార్కులకు అప్పటి ప్రజాప్రతినిధి, ఉన్నతాధికారి కూడా సహకారం అందించినట్లు తాజాగా వెలుగుచూస్తోంది. అక్రమాలను బయటకు రాకుండా తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది.

కళ్యాణదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వచ్చిన కరోనాను అడ్డుపెట్టుకుని ఐసీడీఎస్‌లో ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెరలేపారు. చిన్నారులకు పంపిణీ చేయాల్సిన లక్షల కోడిగుడ్లు, పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించి స్వాహాచేశారు. తాజాగా విచారణ చేస్తుండడంతో ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో చూసి అంగన్‌వాడీ కార్యకర్తలు గుడ్లు తేలేస్తున్నారు. అధికారుల మాట కాదనలేక వారు అడిగిన విధంగా సమాధానాలు రాసి ఇస్తున్నారు. 2020 సంవత్సరంలో కోడిగుడ్ల సరఫరాలో జరిగిన అక్రమాలు అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి. అప్పట్లో పనిచేసిన అధికారులు, ఓ ప్రజాప్రతినిధి, కాంట్రాక్టర్ కుమ్మక్కై లక్షల్లో కోడిగుడ్లను మాయం చేసేసి, ఆ సొమ్మును స్వాహా చేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో కళ్యాణదుర్గం ఆర్డీవోగా పనిచేసిన నిశాంత్‌రెడ్డి కోడిగుడ్ల పంపిణీ గోల్‌మాల్‌పై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదికను అందచేశారు. కానీ ఆయన నివేదికపై కూడా విమర్శలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రజాప్రతినిధి చెప్పినట్లే ఆర్డీఓ నివేదిక ఇచ్చారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కోడిగుడ్లపై కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ మంజులవాణి, సీనియర్ అసిస్టెంట్ షెక్షావలి ఈనెల 14న విచారణ చేపట్టారు. వారు కూడా తూతూ మంత్రంగా విచారణ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ అధికారిని కాపాడేందుకు ఇలా మొక్కుబడిగా విచారణ చేశారని తెలుస్తోంది.

అప్పటి ప్రజాప్రతినిధి అండతోనే..

కరోనా ఉధృతంగా వేళ.. 2020లో కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. కోడిగుడ్లు అరకొరగా సరఫరా చేసి, మిగతా వాటిని పక్కదారి పట్టించారని తెలుస్తోంది. ఇదంతా అప్పటి ఓ ప్రజాప్రతినిధి కనుసైగల్లోనే సాగిందన్న విమర్శలు ఉన్నాయి. ఆ ప్రజాప్రతినిధి ఎలా చెబితే అలా నడుచుకుంటూ స్వాహాకు తెరలేపారని తెలుస్తోంది. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో 31.48 లక్షల కోడిగుడ్లు సరఫరా చేశారు. వీటికి ఏ మాత్రం లెక్కలు లేవు. ఆన్‌లైన్ నమోదుకు, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తల నమోదుకు భారీ వ్యత్యాసం ఉంది. దీంతోనే అక్రమాలు బయటపడ్డాయి. కోడిగుడ్లతో పాటు కిట్లు, బియ్యం, కందిబేడలు, నూనె తదితర సరుకులను అక్రమంగా తరలించి అమ్ముకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలా లక్షలాది రూపాయలు అవినీతి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. 2020 ఏప్రిల్, మే, జూన్, ఆగస్టు మాసాల్లోనే ఈ అక్రమాలు జరిగాయని విచారణ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా విచారణ చేసి, వారికి అనుకూలంగా నివేదికలు తయారు చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అక్రమాలపై పునఃవిచారణ చేయడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.



విచారణ అధికారులు తయారు చేసిన ఐదు ప్రశ్నలు



ఈనెల 14న విచారణకు వచ్చిన కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది (ఫైల్)

క్షేత్రస్థాయికి వెళ్లకుండా విచారణ

కోడిగుడ్ల అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన ఆర్జేడీ కార్యాలయ అధికారులు ఐసీడీఎస్ కార్యాలయంలోనే ముగించడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఐదు ప్రశ్నలు వేసి, వాటికి అవును...అవును... అంటూ సమాధాన్ని రాయించుకోవడంపై విచారణ సక్రమంగా చేపట్టలేదన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా వివరాలు సేకరించాల్సిన అధికారులు.. కార్యకర్తలను కంబదూరు కార్యాలయానికి పిలిపించుకుని విచారణ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లల పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించిన అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

సర్వజనాస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్

పనులు ప్రారంభం

తీరనున్న పార్కింగ్ సమస్య

అనంతపురం టౌన్, మే20(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. పార్కింగ్ లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో అత్యవసర కేసులను ఆస్పత్రిలోకి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైద్యుల కార్లు ఆస్పత్రి ఆవరణలో ఉంచుతుండడంతో రోగులకు అసౌకర్యంగా ఉంటోంది. ఏళ్లుగా పార్కింగ్ సమస్యతో సతమతమవుతున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రికి వచ్చినపుడు ఇంజనీరింగ్ అధికారులతో పార్కింగ్ విషయమై చర్చించారు. నగర పాలక సంస్థ ఇంజనీర్లు మెట్రో సిటీల్లో ఏర్పాటు చేసిన మల్టీలెవల్ పార్కింగ్ గురించి వివరించారు. ఆస్పత్రి ఆవరణలో అలాంటి పార్కింగ్ ఏర్పాటుకు అనువుగా ఉందని నగర పాలక, ఏపీఎంఐడీసీమెడికల్ ఇంజనీర్లు సంయుక్తంగా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. అందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. నిర్మాణవ్యయ బాధ్యతను నగర పాలక సంస్థకు అప్పగించారు. దీంతో మంగళవారం మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు పనులు మొదలు పెట్టారు. అండర్ గ్రౌండ్‌తోపాటు రెండు ఫ్లోర్లు ఏర్పాటు చేయనున్నారు.ఒక్కో ఫ్లోర్‌లో 12 నుంచి 13 వరకు కార్లు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య పరిష్కారమవుతుందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.



జిల్లా ఆస్పత్రిలో ప్రారంభమైన మల్టీలెవల్ పార్కింగ్ పనులు

పని చేసే ఐడియా లేదా?



నిస్తేజంగా పోలీస్ ఐడీ పార్టీలు

జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు

రవాణాను అరికట్టడంలోనూ విఫలం

మత్తు కోసం యువత ప్రయోగాలు



జనవరిలో మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

అనంతపురం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాల్సిన పోలీస్ ఐడీ పార్టీ నిస్తేజంగా మారింది. దీంతో జిల్లాలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గంజాయి రవాణాను నిరోధించి, విక్రేతలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గంజాయి వాడకం పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా సాగుతోంది. గంజాయి ఎక్కడి నుంచి జిల్లాలోకి తెస్తున్నారనేది తెలిసినా, మూలాలను నియంత్రించడంలో పోలీస్ శాఖ వైఫలమైంది. క్రైం, ఐడీ పార్టీలు నిస్తేజంగా మారడంతోనే గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒడిశా, విశాఖ నుంచే...

జిల్లాలోకి గంజాయి ఒడిశా సరిహద్దు, విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి అధికంగా రవాణా అవుతోంది. దీని రవాణాకు 17ఏళ్ల లోపు బాలలను సైతం పంపుతున్నారు. చిన్నపిల్లలు కదా పోలీసులు అనుమానించరనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారు. కానీ వారు కూడా పలు సందర్భాల్లో పట్టుబడ్డారు. మహిళలు కొందరు నేరుగా గంజాయిని తెప్పించి విక్రయిస్తున్నారు. అక్కడ కిలో గంజాయి రూ.వెయ్యి నుంచి రూ.1500లకు వెచ్చించి కొనుగోలు చేసి, రైలులో తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. చిన్న ప్యాకెట్ సైతం రూ.300ల నుంచి రూ.500లకు విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. 20 ఏళ్ల యువకుల నుంచి 50ఏళ్ల వ్యక్తుల వరకు ఈ మత్తులో జోగుతున్నట్లు సమాచారం.

నిస్తేజంగా ఐడీ పార్టీలు...

జిల్లాలో చివరిసారిగా నాలుగు నెలల కిందట ఏడుగురు సభ్యులు గల గంజాయి ముఠాను అరెస్ట్ చేశారు. తర్వాత నగరంలోని ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా గంజాయి పట్టుబడలేదు. ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో కనీసం ఇద్దరు ఐడీ సిబ్బంది పనిచేస్తున్నారు. నేరాలు చేసే వారిని పట్టుకోవడం, గంజాయి, మట్కా, పేకాటలాంటి వ్యవహారాలపై దృష్టి సారించడమే వీరి పని. నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏకంగా ఇద్దరు ఏఎస్ఐలు, ఓ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఐడీపార్టీలో పని చేస్తున్నారు. మిగిలిన స్టేషన్లలో ఇద్దరు లేదా ముగ్గురు పనిచేస్తున్నారు. జిల్లాలోని తాడిపత్రిలోనూ గంజాయి రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఇక్కడకు ఓ ఉన్నతాధికారిని కేటాయించినా పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. గుంతకల్లు పట్టణం గంజాయి వినియోగం టాప్‌లో ఉందనే ఆరోపణలున్నాయి. రైల్వేస్టేషన్ కేంద్రంగా జిల్లాలోకి తొలుత గంజాయి ఇక్కడికే అధికంగా వస్తోందని సమాచారం. ఇక్కడ కూడా పోలీసులు సరిగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. కళ్యాణదుర్గం, రాయదుర్గంలతో పాటు పలు మండల కేంద్రాల్లో గంజాయి వినియోగిస్తున్నారు.

నిద్రమాత్రలనూ వదలని కుర్రకారు

గంజాయి సక్రమంగా దొరక్కపోవడం, చిన్న ప్యాకెట్ సైతం ఎక్కువ ధర పలుకుతుండటంతో అంత డబ్బు పెట్టి కొనలేని యువత నిద్ర మాత్రలను మింగుతున్నట్లు సమాచారం. వారి పర్సనాలిటీలను బట్టి రోజుకు ఒకటి లేదా రెండు మాత్రలు వేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలాంటి వారు ఏదైనా నేరం చేసి జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడి అధికారుల ఆరాలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వాస్తవానికి మెడికల్ షాపుల్లో డాక్టర్ చీటీ లేనిదే నిద్రమాత్రలు ఇవ్వరు. దీంతో కొందరు యువకులు ప్రైవేట్ ఆసుపత్రుల్లోని డాక్టర్ల లెటర్ ప్యాడ్‌లు దొంగిలించి, వాటిపై నిద్రమాత్రలకు సంబంధించిన ప్రిస్క్రిప్షన్ రాసుకుని మెడికల్ షాపుల్లో చూపి తీసుకుంటున్నట్లు తెలిసింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

రాజీవ్‌గాంధీ (వర్ధంతి)



కాంగ్రెస్ అగ్రనేత, దేశ ఆరో ప్రధానిగా వ్యవహరించిన రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20న బాంబే లో జన్మించారు. ఇందిరాగాంధీ, ఫిరోజ్‌గాంధీల పెద్దకుమారుడు. తల్లి మరణంతో అనూహ్యంగా ప్రధాని అయ్యారు. 1984 నుంచి 1989వ వరకు ప్రధానిగా కొనసాగారు. 40 ఏళ్లకే ప్రధాని కావడం గమనార్హం. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రధానమంత్రిగా దూరదృష్టితో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. తమిళనాడు రాష్ట్రం శ్రీపెరుంబుదూరులో ఎల్‌టీటీఈ చేసిన మానవబాంబు దాడిలో 1991 మే 21న ఆయన కన్నుమూశారు. ఆయన వర్ధంతిని జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినంగా ఆచరిస్తున్నారు. ఆయన సేవలకు దేశ అత్యున్నత 'భారతరత్న' పురస్కారం ప్రకటించారు. కాగా ఆయన కుమారుడు, కుమార్తె రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు.

ఉస్తాద్ సబ్రీఖాన్ (జయంతి)



ఉస్తాద్ సబ్రీఖాన్ 1927 మే 21న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మొరాదాబాద్‌లో జన్మించారు. ప్రసిద్ధ సారంగి వాద్యకారులు. 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి స్వాతంత్ర్య ఉత్సవాలలో ఆయన సారంగి వాయించారు. సితార్ వాదకుడు పండిట్ రవిశంకర్, తబలా వాదకుడు అల్లారఖాతో కలసి పలు కచేరీలలో పాల్గొన్నారు. 21కుపైగా దేశాలలో పర్యటించి కచేరీలు ఇచ్చారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అంతిమ ఘడియల్లో ఉన్నప్పుడు కూడా సారంగి వాయించారు. హిందూస్తానీ సంగీతంలోనూ, శాస్త్రీయ సంగీతంలోనూ రాణించారు. ఆయన కుమారుడు, మనవడు కూడా సారంగిలో రాణించారు. ఆకాశవాణితో 50ఏళ్ల అనుబంధం ఉంది. 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' పురస్కారాలు, జాతీయ సంగీత నాటక అకాడమీ అవార్డు, సాహిత్య కళా పరిషత్ అవార్డు ఇతరత్రా అందుకున్నారు. 2015 డిసెంబరు 1న కన్నుమూశారు.

మోహన్‌లాల్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత మోహన్ లాల్ విశ్వనాథన్ 1960 మే 21న జన్మించారు. నటుడు, నిర్మాత, నేపథ్యగాయకుడు, డిస్ట్రిబ్యూటర్. మలయాళ సినిమా రంగంలో రాణించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల సినిమాలలోనూ నటించారు. నాలుగు దశాబ్దాలలో 340కుపైగా సినిమాలలో నటించారు. 5 జాతీయ ఫిల్మ్‌అవార్డులు, రెండు సార్లు ఉత్తమ నటుడు, స్పెషల్ జ్యూరీ అవార్డు, 'పద్మశ్రీ' ఇతర అవార్డులు అందుకున్నారు. 2009లో టెర్రిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదా అందుకున్న తొలి నటుడు. విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యక్ష రాజకీయాలకు మంత్రి రాజణ్ణ గుడ్‌బై

బెంగళూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఎన్ రాజణ్ణ ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెబుతున్నట్టు బహిరంగ ప్రకటన చేశారు. మంగళవారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ 2028 ఎన్నికల్లో పోటీ చేసేది లేదన్నారు. ప్రస్తుతం 75ఏళ్లు అని ఎన్నికలు వచ్చేసరికి మరో మూడేళ్లు అవుతాయని 78ఏళ్లకు చేరుతానన్నారు. ఆరోగ్యదృష్ట్యా వెనుక డుగు వేస్తున్నట్టు తెలిపారు. యువతకు అవకాశం ఇవ్వాలనేది నా ఆలోచన అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేది లేదని, కానీ క్రియాశీలక రాజ కీయాల్లో కొనసాగుతానన్నారు. ఇటీవలే రాజణ్ణ కేపీసీసీ అధ్యక్ష రేసులో ఉన్నానని, అవకాశం ఇస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానన్నారు. తాజాగా హనీ ట్రాప్ కేసులో విచారణలు ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెబుతాననడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కేంద్రం తీరుపై కార్మిక సంఘాల నిరసన



బంగారపేటలో కార్మికసంఘం నిరసన

బంగారపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ తాలూకా కార్యాలయం వద్ద మంగళవారం జేసీటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర కార్మికసంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈనెల 20న కార్మికసంఘాలు నిరసన చేపట్టాయి. కొన్ని కారణాలతో ముట్టడి చేపట్టకుండా కేవలం నిరసనలకే పరిమితమైనట్టు కార్మికసంఘాల నాయకులు తెలిపారు. తహసీల్దార్ వెంకటేశప్పకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జూలైలో ముట్టడికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 8 గంటలపని, పర్మనెంట్ చేయడం, పనికి తగిన వేతనం, సురక్షత వంటి వాటిని విస్మరించి కార్మికులను గులాంలుగా చేసేలా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రూపొందించిన కార్మిక వ్యతిరేక పాలసీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని సంఘటిత, అసంఘటిత, కాంట్రాక్టు కార్మికులు, స్కీం ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కనీసం రూ.36వేలు, జాతీయస్థాయిలో రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, అప్రెంటిస్, ట్రైయినీ, న్యాప్స్ తదితర పేర్లతో కార్మికుల నియామకాలు వద్దన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. నిత్యావసర ధరలు నియంత్రించాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తులపై ఉన్న కేంద్ర ఎక్సైజ్ ట్యాక్స్‌ను తగ్గించాలన్నారు. కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరావ్, మోహన్, రామకృష్ణప్ప, విజయకుమార్, జయలక్ష్మి, రాజప్ప, చంద్రప్ప, పెరుమాళప్ప తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో నేతల పర్యటన

బొమ్మనహళ్ళి, మే20(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా బొమ్మనహళ్ళి, హెచ్ఎస్ఆర్ లేఅవుట్, బన్నేరుఘట్టరోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లలోకి చేరింది. హోసూరు మెయిన్‌రోడ్డులో బొమ్మనహళ్ళి సర్కిల్‌నుంచి సిల్క్‌బోర్డు జంక్షన్ వరకు మోకాలిలోతు నీరు చేరింది. దీంతో పలువురు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటో, ఇతర వాహనదారులు గాయపడ్డారు. అత్యవసర సిబ్బంది మంగళవారం కార్యాచరణలో పాల్గొని సహాయకచర్యలు చేపట్టారు. మంగళవారం కూడా వర్షం కురవడంతో పూర్తిస్థాయిలో సహాయక చర్యలు కొనసాగలేదు. అగర, బెళ్ళందూరు చెరువుల ఆక్రమణల ప్రభావంతోనే వర్షపునీరు సజావుగా ప్రవహించలేదనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్ఎస్ఆర్ లే అవుట్, సిల్క్‌బోర్డు ప్రాంతాల్లో డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు బీజేపీ నాయకులు పర్యటించారు. మరోవైపు స్థానిక కాంగ్రెస్ నాయకులు పర్యటించి ఆలకించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఆర్ అశోక్, స్థానిక ఎమ్మెల్యే సతీశ్ రెడ్డి, జయనగర్ ఎమ్మెల్యే రామమూర్తి, ఎమ్మెల్సీ నారాయణస్వామి తదితరులు పర్యటించారు. రాజకాలువలలో సకాలంలో పూడిక తొలగించక పోవడం పెద్ద సమస్య కారణమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటి వల్ల వర్షాలతో సిల్క్‌బోర్డు జంక్షన్ వంటి కీలకప్రాంతాలు దెబ్బతింటున్నాయన్నారు. మంత్రి రామలింగారెడ్డి స్వయంగా పలు ప్రాంతాల్లో పరిశీలించారు. గత బీజేపీ ప్రభుత్వంలోనూ సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే సమస్యలు తలెత్తాయన్నారు. కాగా పరస్పర ఆరోపణలు మాని పాలకులు ఎవరైనా వర్షపునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మంత్రి రామలింగారెడ్డి వెంట మాజీ మేయర్ మంజునాథరెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు మంజునాథ్, కాంగ్రెస్ నాయకుడు ఉమాపతి, రాఘవేంద్ర, మధు, లోకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



మంత్రి రామలింగారెడ్డి, స్థానిక ప్రముఖులు

విత్తనాలు, ఎరువులకై డిమాండ్

బాగేపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనగింజలు, రసాయన ఎరువుల కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కర్నాటక ప్రాంత రైతుసంఘం (కేపీఆర్ఎస్) డిమాండ్ చేసింది. కేపీఆర్ఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. తొలుత పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి బైక్‌ర్యాలీ ప్రారంభించారు. కేపీఆర్ఎస్ తాలూకా సంచాలకులు డీటీ మునిస్వామి మాట్లాడుతూ గత వారం నుంచి ఉత్తమంగా వర్షాలు కురుస్తున్నాయని, దుక్కులు ప్రారంభించారన్నారు. విత్తనపనులకోసం పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. రైతులకు అవసరమైన విత్తనగింజలు, ఎరువులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. సంఘం సహ సంచాలకులు చన్నరాయప్ప, తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారి గంగాధరరెడ్డికి వినతిపత్రం అందచేశారు. నిరసనలో రఘురామరెడ్డి, అశ్వత్థప్ప, కృష్ణప్ప, నరసింహారెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేత

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని బహుజన సంఘాల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముళబాగిలు, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టాలకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బహుజనసంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. మంగళవారం పట్టణంలో తహసీల్దార్ గీతాకు వినతిపత్రం సమర్పించారు. తాలూకావ్యాప్తంగా 19వేల భూమి పట్టాల మంజూరుకు సంబంధించి అడ్డంకులు ఉన్నాయన్నారు. వీటిలో 5-6వేలు మంజూరుకు అవసరమైన పత్రాలు లేవన్నారు. రైతుల సేవలకు అవ సరమైన పత్రాల మంజూరులో ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. నిర్లక్ష్యం గా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. పి నెంబరు కేటాయించడంలో పేద, మధ్య తరగతి రైతులకు న్యాయం చేయాలని, అవినీతికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సంగసంద్ర విజయ్‌కుమార్, వేమగల్ మురళి, కృష్ణమూర్తి, శంకర్, జనార్ధన్, ఆర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

జాగృతి పెంచడమే కమిషన్ లక్ష్యం

» మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి



మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి తదితరులు

శిడ్లఘట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో అందులోనూ సామాన్య మహిళల్లో జాగృతి కల్పించడం మహిళా కమిషన్ ప్రధాన ఉద్దేశ్యమని మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కుందలగుర్కి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ బృందాల ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ నాగలక్ష్మి చౌదరి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు మాత్రమే కాదని అదొక విప్లవమన్నారు. ఇటీవలికాలంలో సోషల్‌మీడియా ప్రజలకు చేరువగా ఉందని సామాజిక వేదికగా ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రశ్నించే తత్వం పెంచుకోవాలన్నారు. మహిళా కమిషన్ కూడా చాలామందికి తెలియదన్నారు. కమిషన్ చేపట్టే కార్యక్రమాల ద్వారా ఒక్కొక్కరికి తెలుస్తోందన్నారు. మరింత చురుగ్గా ఉండేలా పనిచేస్తున్నామన్నారు. అంతకుముందు గొల్లహళ్ళి సర్కిల్‌నుంచి మహిళలు కళశాలతో ఊరేగింపుగా ఆమెను స్వాగతించారు. జానపద అకాడమీ అధ్యక్షుడు గొల్లహళ్ళి శివప్రసాద్, తహసీల్దార్ బీఎన్ స్వామి, ఈఓ హేమావతి, సీడీపీఓ విద్యావస్త్రద్, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర వర్షంతో పంటలకు నష్టం



దెబ్బతిన్న క్యారెట్ పంట

బాగేపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): తాలూకాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు రకాల పంటలు, తోటలకు నష్టం వాటిల్లింది. తాలూకాలోని కమ్మరవారిపల్లిలో ఈశ్వరప్ప, గోవిందప్పలకు చెందిన టమోటా, క్యారెట్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2 ఎకరాలలో క్యారట్, ఒకటిన్నర ఎకరాలో టమోటా పంట వేశారు. కరువు తాలూకాలో ఒక్కసారిగా మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో పొలాల్లోకి భారీగా నీరు చేరింది. కోతదశలో ఉన్న క్యారెట్ ప్రస్తుతం నీట మునిగింది. పొలంలోకి మోకాలిలోతు వర్షపు నీరు చేరడంతో టమోటా పంట నాశనమైంది. పంటలు దెబ్బతిన్న తమను ఆదుకోవాలని మహిళారైతు ఈశ్వరప్ప డిమాండ్ చేస్తున్నారు. కాగా మంగళవారం మధ్యాహ్నం అరగంటకుపైగా ధారాకారంగా వర్షం కురిసింది. పట్టణంతోపాటు తాలూకాలోని పలు గ్రామాలలో వర్షపునీరు సజావుగా ప్రవహించక డ్రైనేజీ నీరుతో రోడ్లపైకి చేరింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అరగంట జోరుగా కురిసిన వర్షానికే మెయిన్‌రోడ్డు, వాల్మీకి, అంబేడ్కర్‌నగర్ సహా పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు తంటాలుపడ్డారు.

మోదీ మార్ఫింగ్ ఫొటో, వీడియోల షేరింగ్

● ఒకరి అరెస్టు

గార్లదిన్నె, మే 20(ఆంధ్రజ్యోతి): మార్ఫింగ్ చేసిన ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంపిన వ్యక్తిని గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కల్లూరుకు చెందిన మహబూబ్‌బాషా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు బీజేపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ మహ్మమద్ గౌస్‌బాషా మంగళవారం నిందితుడిని తరిమెల క్రాస్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను పంపి, వారి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

నేటి నుంచే టీచర్ల బదిలీలు

- సంఘాల రాష్ట్ర నేతలతో కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ చర్చలు
- బదిలీలపై వెబెక్స్ ద్వారా డీఈఓకి ఆదేశాలు
- 11 మండలాల నుంచి కంప్యూటర్లు సిద్ధం
- నేడు హెచ్ఎంల బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 178 హెచ్ఎం ఖాళీలు



రాష్ట్ర అధికారుల వెబెక్స్‌కు హాజరైన అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు, ఇతర అధికారులు

కేటగిరీ	వర్కింగ్ టీచర్లు
హెచ్ఎంలు	375
ప్రైమరీ హెచ్ఎంలు	329
ఎస్‌జీటీలు	7230
స్కూల్ అసిస్టెంట్లు	6850
మొత్తం	14,748

అనంతపురం విద్య, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ పచ్చజెండా ఊపింది. బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ మొదలుకానుంది. విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలతో మంగళవారం జరిగిన చర్చల్లో ఉపాధ్యాయ సంఘాల నేతలు చేసిన పలు డిమాండ్లకు అంగీకారం లభించింది. వెంటనే అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులతో వెబెక్స్ నిర్వహించి బదిలీలు ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. అనంతపురం జిల్లా నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్ణయ్య ఇతర జిల్లా విద్యాశాఖాధికారులు వెబెక్స్‌కు అటెండ్ అయ్యారు. బుధవారం నుంచీ బదిలీలు ప్రారంభంకానుండటంతో అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న సుమారు 11 మండలాల నుంచి అదనంగా కంప్యూటర్లు, లాప్‌ట్యాప్‌లు తెప్పించడంతోపాటు, శారదాస్కూల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

2017 తర్వాత మళ్లీ ఆఫ్‌లైన్..?

ఉపాధ్యాయ బదిలీలపై జరిగిన చర్చల్లో సంఘాల నేతలు ఎస్‌జీటీలకు ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాష్ట్ర అధికారులు ఆమోదం తెలిపినట్లు స్పష్టమవుతోంది. అయితే అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. అయితే హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్‌లో, ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్‌లో బదిలీల అంశంపై సంఘాల నేతల నుంచి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2017లో ఆఫ్‌లైన్ బదిలీలు నిర్వహించారు. 2017 తర్వాత ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. ఇప్పుడు ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ బదిలీలు అనగానే.. అనేక అక్రమాలు, పైరవీలకు తావు లేకపోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సంఘాల నేతలు బదిలీల్లో పావులు కదపడానికే ఆన్‌లైన్‌కు కాకుండా ఆఫ్‌లైన్‌కు మొగ్గు చూపారన్న ఆరోపణలు వస్తున్నాయి. పారదర్శకత ఉండదని, ఆలస్యం అవుతుందని ఈ విధానాన్ని కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలతోపాటు, జిల్లా విద్యాశాఖాధికారులు కూడా వ్యతిరేకిస్తున్నారు. వేలాది మంది ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ బదిలీల నిర్వహణ అంటే తలపోటేనంటూ అధికారులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచే హెచ్ఎంల బదిలీలు

తొలుత ప్రధానోపాధ్యాయుల బదిలీలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి హెచ్ఎంల బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 178 ప్రధానోపాధ్యాయుల ఖాళీలున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 375 మంది హెచ్ఎంలు ఉన్నారు. వీళ్లలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే 31న ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే వారు తప్పనిసరిగా బదిలీలకు అప్లై చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పనిచేస్తున్న ప్లేస్‌లో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు రిక్వెస్ట్ కింద బదిలీకి అప్లై చేసుకోవచ్చు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శారదాస్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా తప్పనిసరి బదిలీ అయ్యే హెచ్ఎం ద్వారా అధికారులే అప్లై చేయించేలా ఏర్పాట్లు చేశారు.

ఐదేళ్లు పూర్తయ్యే హెచ్ఎంలు తప్పనిసరి: ప్రసాద్‌బాబు, డీఈఓ

ఉపాధ్యాయ బదిలీలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి హెచ్ఎంల బదిలీలు ఉంటాయి. నెలాఖరుకు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే హెచ్ఎంలు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. రెండేళ్ల సర్వీసు పూర్తయిన హెచ్ఎంలు సైతం రిక్వెస్ట్ దరఖాస్తు చేసుకోడానికి సిద్ధంగా ఉండాలి.

4.0తో పెట్టుబడుల ప్రవాహం

- ప్రభుత్వంపై కుదిరిన నమ్మకం
- అనంత వైపు పారిశ్రామిక వేత్తల చూపు
- రూ.11,920 కోట్లతో ఎనర్జీ ప్రాజెక్టులు
- 4,130 మందికి ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి/ అనంతపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై పారిశ్రామిక వేత్తలకు నమ్మకం కుదరడంతో ఉమ్మడి జిల్లావైపు పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి 4.0 పాలసీని తెచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో పారిశ్రామికవేత్తలంతా ఇటువైపే చూస్తున్నారు. ఇప్పటికే మడకశిర నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమతోపాటు కల్లుమర్రి గ్రామాల పరిధిలో 15 వేల ఎకరాల్లో రూ. 7500 కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. బస్సుల బాడీ బిల్డింగ్ తయారీ యూనిట్‌ను గుడిపల్లిలో 70.7 ఎకరాల్లో నెలకొల్పనున్నారు. రూ.1046 కోట్ల పెట్టుబడితో 2381 మందికి ఉపాధి కల్పించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. చిలమత్తూరు మండలం టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా జిల్లాలో ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈల పార్కు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు 35వేల ఎకరాల భూసేకరణకు వేగం పెంచారు. తాజాగా జిల్లాలో రూ. 11920 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రెండు ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు ముందుకు వచ్చాయి. వీటి ద్వారా 4130 మందికి ఉపాధి అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లాకు ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులు క్యూ కడుతున్నాయి.

కేబినెట్ మీటింగ్‌లో పలు ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ప్రతిపాదనలకు సంబంధించి సిఫారసులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఉమ్మడి జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ సంస్థ 2000 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు పెట్టుకున్న అభ్యర్థనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.9000 కోట్ల పెట్టుబడితో స్థాపించనున్న ఈప్రాజెక్టు ద్వారా 3900 మందికి ఉద్యోగ అవకాశలు లభించనున్నాయి. ఈ సంస్థ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. మడకశిర మండలం రాళ్ల అనంతపురం, కురబరహళ్లి ప్రాంతాల్లో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్‌కు చెందిన 300.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును దేశ్రాజ్ సోలార్ ఎనర్జీ సంస్థకు బదిలీ చేయడానికి మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈప్రాజెక్టు ద్వారా రూ. 2920 కోట్ల పెట్టుబడితో 230 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. తాడిమర్రి మండలం పెద్దకోట్లలో అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు 500 మెగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు 12.87 ఎకరాల భూమికి ఎకరాకి రూ. 5లక్షల చెప్పున కేటాయించేందుకు ఆమోదం తెలిపారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.07	1,577.53
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	6,261	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,139	0
నీటి నిల్వ (టీఎంసీలు)	8.75	3.39

తాయమ్మ దేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

సిరుగుప్ప, మే 20 (ఆంధ్రజ్యోతి): తాయమ్మ దేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణంలో ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పత్తారు శ్రీనివాస, ప్రవీణ్ ధూపదీపనైవేద్యాలతో పూజలు చేపట్టారు. ఉదయం మహామంగళహారతి, సాయంత్రం అర్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హాస్టల్ వసతికి దరఖాస్తు చేసుకోండి

● బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున



సిరుగుప్ప, మే 20(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థులు హాస్టల్లో వసతి సౌకర్యం కొరకు జూన్ 16వ తేదీలోగా దరఖాస్తు చేసు కోవాలని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే బీసీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సిరుగుప్ప, టెక్కలకోట, మన్నూరు, సూగూరు, బీఎం సూగూరు గ్రామాల్లో వున్న హాస్టళ్లో వసతి అవాశం ఉంటుందన్నారు. ఎస్సీ వర్గాలకు కూడా కొన్ని సీట్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యారులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మొక్కల పెంపకం అవసరం'

పెనుకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మానవమనుగడకు మొక్కల పెంపకం అవసరమని సాహితీగగన్మహాల్ ట్రస్ట్ అధ్యక్షులు న్యాయవాది ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పెనుకొండ కొండపై సాహితీగగన్మహాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

రోడ్డును ఆక్రమించారు...

అమరాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించారని వెంటనే చర్యలు తీసుకోవాలని గౌడనకుంట గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి శర్మకు మంగళవారం వినతిపత్రం అందించారు. అమరాపురం మండల పరిధిలోని గౌడనకుంట గ్రామంలో ఇందిరమ్మ కాలనీకి పోయే రోడ్డును కొంతమంది ఆక్రమించుకుని, ఫెన్సింగ్ వేశారని, వర్షం వస్తే తమ ఇండ్లలోకి నీరు వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

పరిగి, మే20(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభయాత్ర గురువారం నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు పరిగి వేణుగోపాల్ రావు తెలిపారు. మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీ నుంచి పైడేటి సర్కిల్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత బైక్‌ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెండేళ్లయినా పూర్తికాని ఫ్లైఓవర్ పనులు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● ఆస్పత్రికి వెళ్లాలన్నా 15 కి.మీ. అధిక దూరం ప్రయాణించాల్సిందే..



ఆగుతూ సాగుతూ జరుగుతున్న హొస్పేట రైల్వే ట్రాక్ ఫ్లైఓవర్ పనులు

కంప్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): హొస్పేట పట్టణంలో రైల్వే ట్రాక్ వద్ద ఫ్లైఓవర్ వంతెన పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ పనులు కోసం నిధులు మంజూరై సంవత్సరాలవుతున్న పనులు మాత్రం ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. రెండు సంవత్సరాలైనా పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హొస్పేట నుంచి కంప్లి, గంగావతి మీదుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పీకే హళ్లి మీదుగా తిరిగి కమలాపురానికి రావాల్సి వస్తుంది. ఈ వంతెన పనుల వల్ల 15 కిలోమీటర్ల ప్రయాణ భారం అధికమవుతోందని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రైన్ వచ్చిన సమయంలో గేటు పడినట్లయితే సుమారు గంటల తరబడి ప్రయాణికులు వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లే బాధితులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల కష్టాలు దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిలిచిపోయిన వాహనాలు

ఘనంగా అయ్యప్ప ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న స్వామీజీలు, భక్తులు

బళ్లారి సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాఘవేంద్ర కాలనీలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం జరిగి 12సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంగళవారం కుంభాభిషేకం ఘనగా నిర్వహించారు. సచ్చిదానంద సరస్వతి స్వామీజీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవీ పీఠం బెంగళూరు స్వామీజీ, శ్రీరంగపట్టణం నుంచి 30మంది స్వామీజీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక నుంచి ఆలయానికి వచ్చే భక్తులు అయ్యప్ప స్వామితోపాటు దేవి, నవగ్రహాలను దర్శించుకోవచ్చని అయ్యప్పస్వామి ట్రస్ట్ ఛైర్మన్ జయప్రకాశ్‌గుప్తా తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, 'బుడా' ఛైర్మన్ ఆంజనేయులు, మారుతీ ప్రసాద్, కార్పొరేషన్ సభ్యులు ముండ్లూరు అనూప్ కుమార్, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే రామచంద్రరెడ్డి, నగరానికి చెందినఅనేక మంది ప్రముఖులు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



పూర్ణకుంభాలతో మెట్లను అలంకరించిన భక్తులు



భారీ వర్షాలకు దెబ్బతిన్న వాడికి రోడ్డు

కంప్లిలో భారీ వర్షం

కంప్లి, మే 20(ఆంధ్రజ్యోతి): కంప్లి, కురుగోడు తాలుకాలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈ యేడాది మే నెలలోనే జోరైన వర్షాలు రావడం విశేషం. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వేదవతి నది ఉప్పొంగి ప్రవహించింది. బసరకోడు వద్ద భారీగా నీరు నదిలో ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా తాలుకా సమీపంలోని కరడోనా గ్రామ ఘడివాడికి గ్రామంలోని రోడ్డు ధ్వంసమైంది. ఈ రోడ్డు ధ్వంసం కావడంతో వాడికి క్రాస్ నుండి చిత్రానగుడ్డ వరకు ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది.





ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి, పట్టణంలో జోరువాన

కేంద్ర కార్మిక విధానాలపై ట్రేడ్ యూనియన్ల నిరసన

బళ్లారి సిటీ,మే 20(ఆంధ్రజ్యోతి): అఖిల భారత నిరసనలో భాగంగా ట్రేడ్ యూనియన్ల జాయింట్ కమిటీ(జేసీటీయూ)మంగళవారం బళ్లారి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ నాయకులు దేవదాసు, సీఐటీయూ నాయకులు సత్యబాబు , కార్మిక సంఘం నాయకులు, విఠల్ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 4 వ కార్మిక నియమావలి ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, ఇతర కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళన చేపట్టామన్నారు. అనంతరం లేబర్‌కోడ్ కాపీని, బీమాలో వందశాతం విదేశీ పెట్టుబడుల జీఓలను వారు దహనం చేశారు. వ్యాపారం పేరుతో కేంద్ర ప్రభుత్వం శ్రామిక ప్రజలపై బానిసలుగా మారుస్తోందన్నారు. అంతులేని త్యాగాల ద్వారా సంపాదిచిన 29 కార్మిక చట్టాలను రద్దు చేయడంలో, 4 కార్మిక వ్యతిరేక కార్మిక కోడ్‌లను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్మిక కోడ్‌లు కార్మికుల ప్రస్తుత హక్కుల్లో చాలా వరకు హరించారన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల కార్మిక, ప్రజా వ్యతిరేక చర్యలన్నారు. ఈనేపథ్యంలో శ్రామిక ప్రజలు మరింత వ్యవస్థీకృతమైన తమ పోరాటాన్ని తీవ్రతరం చేయవలసిన అవసరం ఉందన్నారు. జూలై 9న జరిగే అఖిల భారతసమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. వలసకార్మికుల భద్రత రక్షణ శాశ్వత ఉపాధి కల్పించాలి. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించడం ,ఉపాధి హక్కును ప్రాథమిక రాజ్యాంగ హక్కుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఇతర నాయకులు చేతన్, పార్వతమ్మ, జయమ్మ, నాగమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ట్రేడ్ యూనియన్ సభ్యులు

కాంగ్రెస్ అవినీతి సభ

● సంబరాలతో ప్రజాధనం వృథా : మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి



బళ్లారి సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హొసపేటలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమం సాధనసభ కాదని, పూర్తిగా అవినీతి సభ అని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఇది శూన్య అభివృద్ధి సమావేశమని, గ్యారెంటీల పేరుతో ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. కేంద్రనిధులను ఉచిత పథకాలకు ఉపయోగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో నిత్యావసర ధరలు మండిపోతున్నాయన్నారు. ఈప్రభుత్వం తుంగభద్ర జలాశయానికి గేట్లు వేయలేకపోయిందని, అభివృద్ధిని మరచి ప్రభుత్వం వేడుకలకు మాత్రం పరిమితమవు తోందన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ఎప్పుడూ బళ్లారికి రాలేదని, ఇక జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టేది ఎప్పుడని ప్రశ్నించారు. బళ్లారి నగర ఎమ్మెల్యేలు అవినీతి రహిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. పాలనలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసుల్లో, ఆర్టీఓ కార్యాలయాల్లో డబ్బులేకుండా ఏ పనులు జరగవన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినప్పటికీ, రుజువులు అడిగే దుర్బుద్ధి కాంగ్రెస్‌దేనన్నారు. కాంగ్రెస్‌ను భారతదేశం నుండే తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఎంత త్వరగా ప్రభుత్వం మారిపోతే అంత మంచిదన్నారు.

బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తుందో తెలియదన్నారు. ప్రభుత్వం నిధులే లేవంటూ సంబరాలు జరుపుకోవడం విడ్డూరమన్నారు. వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణంలో రూ.కోట్లు దోచుకున్న నాయకులను పక్కన పెట్టుకుని తిరుగుతున్నారన్నారు. జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంపీలు అధికారం కోసం పాకులాడుతారు, కానీ జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టలేరన్నారు. బళ్లారి విశ్వవిద్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని, చాన్సలర్, రిజిస్ట్రార్ మధ్య సమన్వయం లేదని విమర్శించారు. 'బుడా'లో కోల్డ్ వార్ జరుగుతోందని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇది వ్యాపారుల ఆత్మహత్యలకు దారితీసిందని ఆరోపించారు. ఈసందర్భంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12కి.మీ. మేర ట్రాఫిక్ జామ్

● హొస్పేట కాంగ్రెస్ సభతో నిలిచిపోయిన వాహనాలు



బళ్లారి రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

బళ్లారి సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): హొస్పేటలో జరిగిన కాంగ్రెస్ విజయోత్సవ సభకు కార్యకర్తలు తరలివెళ్లారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది వాహనాలు తరలి రావడంతో నగరం కిక్కిరిసిపోయింది. కమలాపూర్, కొప్పళ టోల్ ప్లాజా వరకు వాహనాలు బారులు తీరాయి. హొసపేట నుంచి బెంగళూరురోడ్డులోని మరియమ్మనహళ్ళి గ్రామం, బళ్లారి రోడ్డులోని పాపినాయకనగ్రామం, కల్లహళ్ళి నుంచి రాజపుర వరకు సండూర్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహనాలు జామ్ అయ్యాయి. హొసపేట చుట్టుపక్కల 12 నుంచి 14 కి.మీ వరకు ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.



బారులు తీరిన బస్సులు

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

● బళ్లారి జిల్లాలో కూలీ.. రాయచూరులో గొర్రెల కాపరి







గొర్రెల కళేబరాలు, కరిబసప్ప(ఫైల్), చికిత్స పొందుతున్న పంపన్న

కంప్లి, మే 20(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో రెండు చోట్ల పిడుగుపడి ఐదుగురికి గాయాలు కాగా ఒకరు మృతి చెందారు. మంగళవారం సుగ్గినళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో మేకలు, గొర్రెలు మేపడానికి వెళ్లిన వర్షం రావడంతో శేకన్న పొలంలో చెట్టు కింద దొడ్డ బసప్ప, కరిబసప్ప, పంపన్న నిలబడ్డారు. ఆ ప్రాంతంలో పిడుగుపడటంతో ఆ ముగ్గురు తీవ్ర గాయాలయ్యారు. వారిని చికిత్స కోసం బళ్లారికి తరలించారు. చికిత్స పొందుతూ కరిబసప్ప మృతి చెందారు. అలాగే బళ్లారి రోడ్డులోని రాజన్న మట్టి ప్రతంలో కూడా పిడుగుపడింది. ఇందులో ముగ్గురికి గాయాలయ్యాయి. సిడి హేమన్న, సిడి తిప్పేష్, గౌడ్రు మళ్లీ ఈ పిడుగు పాటుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం గంగావతికి తరలించారు. అలాగే ఆరు గొర్రెలు మృతి చెందాయని తెలిపారు. ఒక్క గ్రామంలో రెండు చోట్ల పిడుగుపడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

రాయచూరులో...



హనుమగౌడ(ఫైల్)

రాయచూరు: ఉరుములు మెరుపులతో కురిసిన వానకు తోడు పిడుగు పడడంతో 16 ఏళ్ల బాలుడు గొర్ల కాపరి మృత్యువాత పడిన సంఘటన సోమవారం రాత్రి జిల్లాలో చోటు చేసుకుంది. అరకెరా తాలూకా భోగి రామనగుండా గ్రామ సమీపంలో హనుమగౌడ నాయక్ అనే 16 ఏళ్ల బాలుడు గొర్లను మేపేందుకు వెళ్లగా అదే సమయంలో ఒక్క సారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో గొర్ల వద్ద ఆగిపోయిన బాలుడు పిడుగుపాటుకి గురై మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన జాలహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

టీడీపీ కార్యకర్తపై దాడి

పెనుకొండ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు గ్రామ శివారులో టీడీపీ కార్యకర్త బోయ ఆంజనేయులుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మునిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ ఆంజనేయులు మంగళవారం ఉదయం కొత్తచెరువులకు మామిడికాయలు విక్రయంచి తిరిగి వస్తున్నారు. మునిమడుగు గ్రామశివారులోకి రాగానే గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనం అడ్డుపెట్టి ఆపారు. అది పరిశీలించేలోపే చెట్లపొదల్లోంచి నలుగురు రాళ్లతో మూకుమ్మడిగా దాడిచేసి ఉండాయించారన్నారు. కియ నుంచి కొత్తచెరువుకు వెళ్లే కార్మికులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు.

హెచ్ఐవీపై అవగాహన

హిందూపురం, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండులో మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై వీధినాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపట్ల వివక్ష చూపరాదన్నారు.

హోసూరు జోన్

రోడ్డుపై లారీ బోల్తా - ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్ క్లియర్ చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని పూనపల్లిలో సోమవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలోనూ పాత ఇనుప సామగ్రితో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. ఎమ్మెల్యే వై ప్రకాశ్ నేతృత్వంలో పోలీసులు, వాహన యజమాని ఇతరుల సహకారంతో రెండు క్రేన్లతో లారీని తొలగించారు. ఎట్టకేలకు ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేయడంతో వాహన చోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పందుల అపహరణకు యత్నం

● నిందితులను పట్టుకున్న గ్రామస్థులు

రాయచూరు, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సరిహద్దులో ఉన్న బళ్ళారి జిల్లా కూడ్లగి తాలూకా ఆలూరు గ్రామంలో పందులను ఎత్తుకెళ్లెందుకు యత్నించిన దుండగులను గ్రామస్థులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం గ్రామంలో గుర్తు తెలియని యువకులు సంచరిస్తుండాన్ని గమనించిన యువకుడొకరు కేకలు వేయడంతో వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులందరూ అక్కడికి రాగా నిందితులు పరారైయ్యారు. దీంతో వెంబడించి ఇద్దరు నిందితులను చిక్కించుకున్న గ్రామస్థులు వారిని తాళ్లతో బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారించగా తామంతా 8 నుంచి 9 మంది ఉన్నామని, నిందితులంతా రాయచూరు జిల్లా సింధనూరు, గంగావతి, కొప్పళ సమీపంలోని మూడు గ్రామాలకు చెందిన వారుగా పోలీసులు తమ విచారణలో గుర్తించారు. ఇద్దరు నిందితులు గ్రామస్థులకు పట్టుబడగా మిగితా వారంతా పరారైనట్లు తెలిపారు. కాగా గ్రామస్థులకు పట్టుబడిన ఇద్దరు నిందితులతో పాటు పందులను ఎత్తుకెళ్లెందుకు వినియోగిస్తున్న పికప్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రెండో రోజూ దంచేసిన వాన



జలమయమైన నగర వీధులు

హోసూరు, మే 20(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంతోపాటు కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తోంది. చెరువులు, కుంటలు నిండుకుంటున్నాయి. సోమవారం కూడా భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా 70మిమీ వర్షపాతం నమోదైంది. ప్రత్యేకించి పిల్లలను వాగులు, వంకలు, డ్యామ్‌ల వద్దకు ఒంటరిగా పంపరాదని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కాగా ప్రత్యేకించి కెలవరపల్లి డ్యామ్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో అదే రీతిన డ్యామ్‌నుంచి కూడా నీటిని విడుదల చేస్తున్నారు. డ్యామ్‌నుంచి విడుదల చేస్తున్న నీరు నురగతో కూడి ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆనకట్ట సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 40.67 అడుగులుగా ఉంది. కెలవరపల్లి, మోరనపల్లి, పెరండ స్కూల్, తొడప్పస్కూల్, అజియాలం, పాతకోట వంటి ప్రాంతాల మీదుగా తెన్‌పెన్నై నది ప్రవహిస్తోంది. నదికాలువల వద్ద ప్రజలు అప్రమత్తం ఉండాలని అధికారులు సూచించారు.



నురగ మధ్యలో ప్రయాణిస్తున్న బస్సు



ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు